క్లుప్తంగా

మున్సిపల్ సమావేశం రేపు

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి నిమిత్తం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఆమోదం కోసం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ తప్పక హాజరవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో సన్యాసిపుట్టుగ గ్రామంలోని దళిత నిరుపేద కుటుంబానికి చెందిన పాటి చంద్రమ్మకు కేశుపురం గ్రామానికి చెందిన కాశీమాత సేవా సమితి సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం గురువారం అందించారు. ఆమె చిన్న కుమారుడు దివ్యాంగుడు కాగా, పెద్ద కుమారుడు వెంకటేష్ అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. దీంతో ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపింది.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామంలో మూడు సిమెంటు రోడ్ల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి



ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: మండలంలోని తొలుసూరుపల్లి పంచాయతీ మున్సబుపేట గ్రామ పరిధి సర్వే నంబర్ 105–3లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు గురువారం గ్రామస్తులతో కలిసి టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని దేవస్థానం ఆధీనంలో ఉన్న స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేసినప్పటికీ, ఆయా అధికారుల నుంచి ఎప్పటికప్పుడు హెచ్చరికలు వస్తున్నాయని గుర్తు చేశారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలంలో దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఆదుకోవాలని విన్నవించారు.

చెత్తవేస్తే చర్యలు తప్పవు



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలోని కాలువల్లో చెత్తవేస్తే దుకాణదారులపై చర్యలు తప్పవని కమిషనర్ నడిపేన రామారావు హెచ్చరించారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో గురువారం ఆయన పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ చెత్తను చెత్తబుట్టలో వేయాలని సూచించారు. నగర పరిశుభ్రతకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కవిటి: మండలంలోని గొర్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ఇటీవల సత్తాచాటారు. జిల్లా స్థాయి పెన్ కాక్ సిలాట్ ఛాంపియన్ షిప్ టాండింగ్ పోటీల్లో 8వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ రెడ్డి, 4వ తరగతి చదువుతున్న పైల హరీష్‌లు బంగారు పతకాలు సాధించారు. దీంతో వీరిని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లు గురువారం అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ధనంజయ మజ్జి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

టెక్కలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జరగనున్న ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.



చూడండి సారూ..

ఈ ప్రైవేటు తీరు..!

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు బస్సులు
- పర్మిషన్ లేని రూట్లలో ప్రయాణం
- ఆర్టీసీ బస్సులు వేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం



ఇచ్ఛాపురం రూరల్:

ఆర్టీసీ బస్సు సదుపాయం లేకపోవడంతో ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అనుమతులు లేని రూట్లలో బస్సులు నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం ఇచ్ఛాపురం నుంచి ఇన్నేశుపేట, ధర్మపురం మీదుగా డొంకూరు తీర ప్రాంతానికి 16 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మధ్యలో లొద్దపుట్టి, అయ్యవారిపేట, తులసిగాం, పూర్ణాటకం, కొళారీ, ఈదుపురం, నీలాపుపుట్టుగ, కేశుపురం, సన్యాసిపుట్టుగ, బూర్జపాడు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి ఇంటర్, డిగ్రీ చదవాలంటే విద్యార్థులు ఇచ్ఛాపురం వెళ్లాల్సిందే. అదేవిధంగా వ్యాపారలావాదేవీలు, ఆస్పత్రులకు వెళ్లాలంటే ఇచ్ఛాపురమే దిక్కు. దీన్ని ఆసరాగా తీసుకున్న ప్రైవేటు బస్సు యాజమాన్యాలు రెండు ప్రైవేటు బస్సులకు పర్మిషన్ పొంది, డొంకూరు నుంచి ఇచ్ఛాపురంలకు ఒక్కో బస్సు సమయాన్ని బట్టి నాలుగైదు ట్రిప్పులు వేస్తున్నారు. ఒక్కో ప్రయాణికుడు డొంకూరు నుంచి ఇచ్ఛాపురం వెళ్లేందుకు రూ.40 లు చెల్లించాల్సి వస్తోంది.

మా దారి.. అడ్డదారి

ఈదుపురం నుంచి బెల్లుపడ మీదుగా ఇచ్ఛాపురం వెళ్లేందుకు ఏడాది క్రితం కొత్త తారు రోడ్డును గత ప్రభుత్వం నిర్మించడంతో ప్రైవేటు బస్సు యాజమాన్యానికి వరంగా మారింది. ఈ రూట్‌లో ప్రైవేటు బస్సులు వెళ్లేందుకు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ సంబంధిత రవాణాశాఖ అధికారులను ప్రసన్నం చేసుకుంటూ, వారికి నెలవారీ మామూళ్లు చెల్లించుకుంటూ దర్జాగా ప్రైవేటు బస్సులు నడుపుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తమ గ్రామాలకు రావాల్సిన బస్సులు అడ్డదారిలో వెళ్లిపోతుండడంతో కొళారీ, పూర్ణాటకం, ధర్మపురం, తులసిగాం, ఇన్నేశుపేట గ్రామాలకు చెందిన ప్రయాణికులు, విద్యార్థులు ఆటోలను బుకింగ్ చేసుకుంటూ ప్రయాణిస్తున్నారు. అంతేకాకుండా సుమారు ఐదు కిలోమీటర్ల మేర అడ్డదారిలో బస్సులను నడుపుతూ ప్రయాణికుడి వద్ద మరలా రూ.40లనే వసూలు చేస్తూ బస్సు యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు బస్సు యాజమాన్యం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ఇచ్ఛాపురం నుంచి డొంకూరు వరకు ఆర్టీసీ బస్సులను నడపాలంటూ ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఆర్టీసీ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. కేవలం ప్రైవేటు యాజమాన్యాలకు మేలు చేసేందుకే అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ససేమిరా అంటున్నారని ప్రయాణికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



మా ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు నడిచేందుకు రూట్లు ఉన్నా బస్సు వేసేందుకు మాత్రం అధికారులు ఇష్టపడడం లేదు. దీంతో ప్రయాణికులు ఎప్పుడు వస్తాయో గ్యారెంటీ లేని ప్రైవేటు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇచ్ఛాపురం వెళ్లాలంటే ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రైవేటు బస్సులు ఈదుపురం నుంచి బెల్లుపడ రూట్‌లో వెళ్లిపోతుంటాయి. దీంతో రోగులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– ఇసురు తులసీరామ్, తులసీగాం

ఆర్టీసీ బస్సు నడపాలి



ప్రైవేటు బస్సులో డొంకూరు నుంచి ఇచ్ఛాపురం వెళ్లాలంటే రూ.40లు చెల్లించాల్సి వస్తోంది. ఆటోలో వెళ్లాలంటే కూడా అదే ధర చెల్లించాల్సిన పరిస్థితి. ఇప్పటికే పలుమార్లు మా తీర ప్రాంతానికి ఆర్టీసీ బస్సు వేయాలంటూ అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది. ఒక్కో సమయంలో ప్రైవేటు బస్సులు పెళ్లిళ్లు, బహిరంగ సభలకు వెళ్లిపోతే మరీ నరకంగా ఉంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే సామాన్యుడు ఇచ్ఛాపురం వెళ్లి రావాలంటే దాదాపు రూ.100లు రవాణా ఖర్చులకే సరిపోతుంది. ఇప్పటికైనా మా ప్రాంతానికి ఆర్టీసీ బస్సు వేస్తే బాగుంటుంది.

– దున్న గురుమూర్తి, బూర్జపాడు

చర్యలు తప్పవు



అనుమతులు లేని రూట్లలో ప్రైవేటు బస్సులు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటాం. కొత్త రూట్లకు పర్మిషన్ తీసుకోవాల్సిందే. డొంకూరు నుంచి కొళారీ, ధర్మపురం మీదుగా ఇచ్ఛాపురం వచ్చేందుకు మాత్రమే ప్రైవేటు బస్సులకు పర్మిషన్ ఉంది. ఈ బస్సులపై ఇప్పటికే మాకు ఫిర్యాదులు అందాయి. మా పరిశీలనలో నిజమని తేలితే బస్సులు సీజ్ చేయడం జరుగుతుంది.

– ఆర్.గోవిందరాజు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం

నాటుసారా నిర్మూలనకు సహకరించాలి



పలాస: మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

పలాస: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మండలంలోని పెదంచల గ్రామంలో నవోదయం 2.0 అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నవోదయ రథం ప్రతీ గ్రామంలోకి వెళ్లి ప్రచారం చేస్తుందన్నారు. నాటుసారా వల్ల యువత అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఎంపీడీవో కె.వసంతకుమార్, పలాస ఎక్సైజ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లిఖార్జునరావు, ఎంపీటీసీ తలగాన శ్రీరాములు, సర్పంచ్ వరిశ రామారావు, ఉప సర్పంచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: గ్రామాలు సారా రహితంగా మారి అభివృద్ధిలో ముందుకు సాగాలని సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబి ఆకాంక్షించారు. మండలంలోని మాకన్నపురం పంచాయతీ శారదాపురం గ్రామంలో నవోదయం 2.0 అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా సేవించడం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా శైలేంద్ర



జి.ఎస్.శైలేంద్ర

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.ఎస్.శైలేంద్రను కార్యవర్గ సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా శిలగాన భాస్కరరావు, కార్యదర్శిగా వజ్జగోపి, సంయుక్త కార్యదర్శిగా దున్న జోగారావు, కోశాధికారి గా బొడ్డ ధర్మారావును ఎన్నుకున్నారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మద్దు సర్వేశ్వరరావు, వి.సి.పట్నాయక్, కుణితి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: బాధ్యతలు స్వీకరిస్తున్న ఫయాజ్ అహ్మద్

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. గురువారం ప్రస్తుత అధ్యక్షుడు ఎస్.విశ్వేశ్వరరావు అధ్యక్షతన, సీనియర్ న్యాయవాది పైల రాజరత్నం నాయుడు ఆధ్వర్యంలో పలాస బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా మహ్మద్ ఫయాజ్ అహ్మద్ (ఘని), ఉపాధ్యక్షుడిగా బి.కామేశ్వర పట్నాయక్, కార్యదర్శిగా బెండి కాళిదాస్, సంయుక్త కార్యదర్శిగా జి.ఎం.ఎస్.అనిల్ రాజ్, కోశాధికారిగా వి.రవికుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా కోత రజినికుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ సుధాకర్

టెక్కలి: ఉపాధి హామీ పనుల నిధుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ బి.సుధాకర్ హెచ్చరించారు. టెక్కలి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు, ఖర్చు చేసిన నిధులపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల వివరాలతో, గురువారం టెక్కలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 27 పంచాయతీల్లో సుమారు రూ.17.14 కోట్లతో చేపట్టిన 1,877 ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ నివేదికలను తెలుసుకున్నారు. అనంతరం పీడీ సుధాకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అవసరమైన ప్రతీ కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, డీవీవో స్వరూపారాణి, ఏపీడీలు రాధ, శైలజ, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి, మండల ఇంజినీర్ ఎస్ఎల్ నాయుడు, ఏపీవో బి.ప్రసాద్, హౌసింగ్ ఈఏ సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ఉంటే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి షణ్ముఖరావు

టెక్కలి: సభ్యులంతా సమష్టిగా ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయని జగద్ధాత్రి విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ షణ్ముఖరావు అన్నారు. గురువారం కార్పెంటర్స్ డే సందర్భంగా టెక్కలి జగద్ధాత్రి దేవి ఆలయం ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా సంఘం సభ్యులంతా కలిసికట్టుగా ఒకే తాటిపై నడవాలని సూచించారు. తద్వారా సేవా సంఘం అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. అనంతరం భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు.కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు సింహాద్రి కుమార్, కె.తారకేశ్వరరావు, ఎస్.చిరంజీవి, ఆర్.డిల్లేశ్వరరావు, కె.సూర్యనారాయణ, నాగరాజు, కామేశ్వరరావు పాల్గొన్నారు.


రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత

టెక్కలి: పెన్షనర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత సూచించారు. టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయా భవనంలో గురువారం నిర్వహించిన సీనియర్ సిటిజన్ అవగాహన, గుర్తింపు కార్డుల మంజూరు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2007 సంవత్సరంలో అమలు చేసిన తల్లిదండ్రులు, వయోవృద్ధుల మెయింటెనెన్స్ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, జీవీ రెడ్డి, నాగభూషణరావు, అయ్యబాబు, హరిశ్చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో నమోదు వేగవంతం



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీదేవి

కవిటి: వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులకు మధ్య పరస్పర సమన్వయం, సహకారంతోనే రైతులకు విశిష్ట సంఖ్య(ఫార్మర్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియ వేగవంతం అవుతుందని మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి అన్నారు. మండలంలో కవిటి–3 సచివాలయంలోని పెద్ద ఎర్రగోవిందపుట్టుగ రైతుసేవా కేంద్రం పరిధిలో రైతులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను ఎలా చేయించుకోవాలనేది వివరించారు. రైతులు తమ భూమి హక్కు పత్రాలు, ఆధార్ తదితర వివరాల ను తీసుకొచ్చి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకుడు అందుబాటులో ఉంటారన్నారు.


పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న అప్పలరాజు

పలాస: మండలంలోని గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన కోరాడ మధుసూదన్ యాదవ్(28) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు గురువారం పరామర్శించాడు. మృతుడి తండ్రి కోరాడ లింగమూర్తిని కలిసి ఓదార్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దువ్వాడ రవి, సైని దేశయ్య, మద్దిల పాపారావు, బత్తిన హేమేశ్వరరావు, సార్ర తిరుపతిరావు, పైల చిట్టి, రాపాక చిన్నారావు తదితరులు ఉన్నారు.

సోంపేట: మండలంలో కొర్లాం గ్రామంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం పరామర్శించారు. కొర్లాం పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు తామాడ గణపతి, తామాడ భారతి భార్యభర్తలు ఇటీవల ఐదు రోజుల వ్యవధిలో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త గుడియా కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబాన్ని సైతం పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్దాన శ్రీకృష్ణ, టి.మోహన్, చంటి తదితరులు పాల్గొన్నారు.



సోంపేట: కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహిళా సంఘాలు అవగాహన పెంచుకోవాలి



కంచిలి: మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ రామ్మోహన్



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు



పలాస: మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఈశ్వరరావు

టెక్కలి రూరల్: యాప్‌ల వినియోగంపై మహిళా సంఘాల సభ్యులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వెలుగు ప్రాజెక్ట్ బ్యాంకు లింకేజీ డీపీఎం ఎ.నాగలక్ష్మి సూచించారు. కోటబొమ్మాళి వెలుగు కార్యాలయంలో మహిళ స్వయం శక్తి సభ్యులకు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025–26 సంవత్సరాల వార్షిక క్రెడిట్, జీవనోపాధుల ప్రణాళికలు తయారు చేయడానికి ప్రతీ 6 సంఘాల్లో ఒక విద్యావంతురాలు, సేవాభావం ఉన్నవారిని ఎన్యుమరేటర్‌గా గుర్తించి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో వెలుగు ఏసీ ఎస్.శ్రీరాములు, ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: స్వయం శక్తి సంఘాల సభ్యులు వార్షిక అప్పులు, జీవనోపాధుల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని వెలుగు ఏపీఎం జి.ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలు, ఎన్యుమరేటర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు హరిప్రియ, వీవోఏల అధ్యక్షురాలు కె.సరస్వతి, కోశాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: స్వయంశక్తి సంఘాలకు ఇచ్చే వార్షిక అప్పులతో జీవనోపాధుల ప్రణాళికలు రూపొందించాలని ఐకేపీ ఏరియా కో–ఆర్డినేటర్ చింతాడ రామ్మోహన్ సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, ఎన్యుమరేటర్లకు శిక్షణ శిబిరం గురువారం నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలాస: మహిళా సంఘాల అప్పులు, జీవనోపాధులకు సంబంధించిన బడ్జెటు ప్రణాళికబద్ధంగా ఉండాలని డీఆర్‌డీఏ స్పెషల్ ఆఫీసర్ కె.ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో గురువారం డ్వాక్రా సంఘాలకు సంబంధించిన ఎన్యూమరేటర్లకు శిక్షణ విబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం జాంబవతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు నేడు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం 2012 అంశంపై సాయంత్రం 4:30 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు



జేసీబీతో గోతులు తవ్విస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం: బాహుదానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈనెల 17వ తేదీన సాక్షి పత్రికలో 'ఇసుకాసురుల బరితెగింపు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి గురువారం రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బాహుదా నదిలోకి వెళ్లే అన్ని మార్గాల గుండా జేసీబీ యంత్రాల సాయంతో పెద్ద పెద్ద గుంతలు తవ్వించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే ఆ వాహనాల అనుమతులను రద్దు చేస్తామని, వాల్టా యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యజ్ఞానికి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం



ఎమ్మెల్సీ నర్తు రామారావును ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

కవిటి: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి బెల్లుపడలో ఏప్రిల్ 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీరామ తారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞానికి పలువురు ప్రజాప్రతినిధులను కమిటీ సభ్యులు గురువారం ఆహ్వానించారు. శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ప్రభుత్వ విప్ డా.బి.అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావులను వారి గ్రామాల్లో కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు. ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఈ యజ్ఞం శుభరాట కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రైతులను గౌరవించాలి

నందిగాం: ప్రతి ఒక్కరూ రైతులను గౌరవించాలని డాక్టర్ రెడ్డి చిన్నంనాయుడు అన్నారు. మండలంలోని పెద్దతామరాపల్లిలో టెక్కలి నియోజకవర్గ తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ కార్యవర్గ సభ్యులు ఇలాంటి కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం రచయిత మజ్జి దేవిశ్రీ దారపు ధర్మారావును సంఘం తరుపున సన్మానించారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు పోలాకి వాసుదేవరావు, గౌరవ అధ్యక్షుడు పోలాకి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంకల దివాకర్, ప్రధాన కార్యదర్శి తమిరె బలరాం, పారిశ్రామికవేత్త బాడాన రాజశేఖర్, తమిరి దేవేంద్ర, పోలాకి డిల్లేశ్వరరావు, తూలుగు మహేష్, సలాన సంజీవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చిన్నంనాయుడు